క్లుప్తంగా

మాజీ ఉప సర్పంచ్ మృతికి సంతాపం


గంగునాయుడు(ఫైల్)

మునగపాక: ఉమ్మలాడ మాజీ ఉప సర్పంచ్ మొల్లేటి గంగునాయుడు(61) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన ఉమ్మలాడ గౌరీ సేవా సంఘ అధ్యక్షునిగా ఇటీవల నియమితులయ్యారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గంగునాయుడు మృతి పట్ల సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ,ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి, మాజీ సర్పంచ్ కర్రి అప్పారావు, మాజీ ఎంపీటీసీ మొల్లేటి శేషు,మాజీ ఉప సర్పంచ్ పల్లి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ దళిత విభాగం మండల కన్వీనర్ మందా రాము తదితరులు సంతాపం తెలిపారు.

నేడు హౌసింగ్ డే

కోటవురట్ల: స్థానిక వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో శనివారం హౌసింగ్‌డే నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ పాల్గొంటారని, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ పొందుతున్న వలంటీర్‌లతో ఎంపీడీవో రవికుమార్

మునగపాక: ఆపద మిత్ర పథకం ద్వారా అందుతున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవి కుమార్ తెలిపారు. ఆపద మిత్ర శిక్షణకు ఎంపికైన 11 మంది వలంటీర్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. గ్యాస్ లీకేజీ, ఎవరైనా నీటిలో మునిగిపోయినప్పుడు, విద్యుత్ షాక్ వంటి సంఘటనల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జరుగుతున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య డ్రైవ్


చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. శ్మశాన వాటిక, జెడ్పీ హైస్కూల్ పరిసరాల్లో భారీగా చెత్త పేరుకుపోవడంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు చేపట్టారు. చెత్తను తొలగింపజేసి బ్లీచింగ్ చల్లించారు. పారిశుధ్యం మెరుగుకు అందరూ సహకరించాలని కోరారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న ధ్యానగురువు సుజాత

మునగపాక: ధ్యానంతో ఒత్తిడిని దూరం చేయవచ్చని ధ్యానగురువు సుజాత అన్నారు. మండలంలోని నాగులాపల్లిలోని చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిలో ఉన్న జీవ రాశులను ప్రేమించడం ద్వారా వాటి నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చన్నారు. ప్రకృతిని గౌరవించాలని సూచించారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

యలమంచిలి: ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ ఈ నెల 31 వరకు వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు,ఖాళీ స్థలాలు పన్నులను చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని,పన్నులను మున్సిపల్ ఆఫీసులోని కౌంటర్‌లో గాని వార్డు సచివాలయాల్లో గాని చెల్లించవచ్చని చెప్పారు. ఆన్‌లైన్‌లో నెట్ బ్యాంకింగ్,డెబిట్,క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

పల్లెల్లో కొత్త అమావాస్య సందడి

ముస్తాబవుతున్న గ్రామదేవతల ఆలయాలు


దేవవరంలో అమ్మవారి ఘటాలతో నృత్యం చేస్తున్న భక్తులు


నూకాలమ్మ ఆలయం


కె.వెంకటాపురంలో గరగల ఊరేగింపులో గ్రామస్తులు

నక్కపల్లి: గ్రామదేవతల పండగ సందడి మొదలైంది. నూకాలమ్మ, మరిడమ్మ, సత్తమ్మ, బంగారమ్మ, ఓరుగుంటాలమ్మ తదితర అమ్మవార్ల పండగలను ఏటా కొత్తఅమావాస్యకు 10 రోజుల ముందు నుంచి నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రతి రూపాలుగా భావించే గరగలు, ఘటాలను గ్రామాల్లో ఊరేగిస్తున్నారు. మరికొంత మంది తమ ఇళ్ల వద్ద ఘటాలకు ప్రత్యేక పూజలు చేస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. నక్కపల్లి, ఉద్దండపురం, వేంపాడు, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, దేవవరం, కాగిత, పాయకరావుపేట, మంగవరం, సత్యవరం, పెంటకోట సీతారామపురం, నామవరం తదితర గ్రామాల్లో డప్పు వాయిద్యాలు, నేల వేషాలతో ఘటాలను ఊరేగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో సందడివాతావరణం నెలకొంది. కొత్తఅమావాస్య ముందురోజు రాత్రి జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నక్కపల్లి, వేంపాడు, దేవవరం తదితర గ్రామాల్లో ఈ నూకాలమ్మ జాతర ఘనంగా జరుగుతుంది. అమ్మవారి పండగ కోసం ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

కోటవురట్ల: పల్లెల్లో కొత్త అమావాస్య పండగ సందడి మొదలైంది. పలు గ్రామాల్లో జాతరలు నిర్వహిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. కొత్త అమావాస్యకు ఐదు రోజుల ముందు నుంచి అమ్మవారి గరగలను ఊరేగిస్తారు. కె.వెంకటాపురం, కైలాసపట్నం, రామచంద్రపురం, కోటవురట్ల తదితర గ్రామాలలో గరగలను ఊరేగిస్తున్నారు. గ్రామస్తులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఎస్.రాయవరం: కొత్త అమావాస్య సందర్భంగా గ్రామాల్లో గరగలను ఊరేగిస్తున్నారు. డప్పుల వాయిద్యాలు, నృత్యాలతో గ్రామాలు సందడిగా మారాయి. కోనవానిపాలెం గ్రామంలో చిన్నారులు ,కోలాటం నిర్వహించారు.కొత్తపోలవరం వృద్ధుడి కర్రసాము అబ్బురపరిచింది.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


బీమా నగదు అందజేస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామానికి చెందిన పలివేల అప్పలనాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష ప్రభుత్వం మంజూరు చేసింది. ముందుగా మృతుని కుటుంబ సభ్యులకు రూ.10వేల సాయాన్ని సర్పంచ్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సాయం అందజేస్తుందన్నారు.పంచాయతీకార్యదర్శి శ్రీదేవి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు


బోదిగల్లం పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

నక్కపల్లి: వేసవి సమీపిస్తున్నందున తాగు నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండలంలో బోదిగల్లం పంచాయతీ కార్యాలయ సిబ్బందిని ఈవోపీఆర్డీ వెంకటనారాయణ ఆదేశించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లపై దృష్టిసారించాలని, శానిటేషన్, వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా జరపాలని సూచించారు. పంచాయతీలో చేపట్టిన అభివృద్ధిపనులను గురించి తెలుసుకున్నారు.జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమంలో భాగంగా తడిపొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు చేర్చాలన్నారు. వీధులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా ప్రజలకు అవగాహనకల్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి సామ్‌సున్నీసా బేగం, సర్పంచ్ ఫాతిమున్నీసాబేగం పాల్గొన్నారు.

యోగాతో మహిళలకు మరింత ఆరోగ్యం


మహిళ యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీలా లక్ష్మీసౌజన్య

తుమ్మపాల : యోగా మహిళల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య అన్నారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో గవరపాలెం మల్ల జగన్నాథం హాల్లో మహిళలకు ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా అనేక సమస్యలను నయం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఇంటిలోను యోగాసనాలు చేయడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. మహిళల్లో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు యోగా చక్కని పరిష్కారం చూపుతుందన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు భీశెట్టి దొరమునాయుడు మాట్లాడుతూ పట్టణంలో జార్జి క్లబ్ వద్ద ఇప్పటికే యోగా కేంద్రం నిర్వహిస్తున్నామని, మహిళల కోసం మరో కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించినట్టు తెలిపారు. ప్రతి రోజు కనీసం గంట సమయం యోగాసనాలు వేస్తే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందగలమన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సాయి నాగేశ్వరరావు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కొలపర్తి కన్నబాబు, దాడి శ్రీను, కాండ్రేగుల గోవిందు, మహిళలు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులతో ఆందోళన


ఎస్.రాయవరంలో మేఘావృతమైన ఆకాశం

కోటవురట్ల/ఎస్.రాయవరం/రాంబిల్లి: వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. వరి నూర్పులను వాయిదా వేసుకున్నారు. భారీ వర్షాలు పడితే జీడి పూత, పిందెకు నష్టం వాటిల్లే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎస్.రాయవరం మండలంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమైంది. ఉదయం జల్లులు కురిశాయి. చల్లని వాతావరణం ఆహ్లాదపరచింది. రాంబిల్లిలో చినుకులు పడడంతో నూర్చిన ధాన్యం, తీసిన పెసర, మినుము మొక్కలపై పరదాలు కప్పారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన


జల్‌జీవన్ పనులను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించినట్టు ఈవోఆర్‌డీ సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల అభివృద్ధి పనులను పరిశీలించినట్టు ఆయన చెప్పారు. పీఎల్ పురంలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను సంపద కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించినట్టు తెలిపారు. ఈవోఆర్‌డీతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్ మనోజ్, సర్పంచ్ పడాల సోమన్నదొర, కార్యదర్శి బి.ఎ.బి.ఎల్. మూర్తి ఉన్నారు.

200 మందికి దంత వైద్య పరీక్షలు


దంత వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

అనకాపల్లి రూరల్ : దంత సంరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ సూచించారు. తుమ్మపాల ప్రధాన రహదారిలో సాయిబాబా గుడి వద్ద జీవిత బీమా పాలసీదారుల సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరాన్ని శుక్రవారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. అనంతరం అనకాపల్లి పీవీకే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి దంత వైద్య నిపుణులు వెంకటేష్, నితిన్ వైద్య శిబిరానికి వచ్చిన సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముమ్మన అప్పారావు, టీడీపీ నేత, మాజీ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, తుమ్మపాల ఉపసర్పంచ్ చదరం చిన్నా, యరబండ్ల సత్యనారాయణ, బొడ్డపాటి రాజారావు పాల్గొన్నారు.

నాణ్యత పాటించకపోతే చర్యలు


వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కొండలరావు, ఎంఈవో సూర్యారావు

రాంబిల్లి: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత, పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు హెచ్చరించారు. శుక్రవారం ఎంఈవో ఎం.సూర్యారావు, ఈవోపీఆర్డీ రాజుతో కలిసి ఆయన రాజుకోడూరు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. రాజుకోడూరు పాఠశాలలో నాణ్యత, పరిశుభ్రత లోపించడంతో ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు.

దోమల నివారణకు సహకరించాలి


యాంటీ లార్వా మందును పిచికారి చేయిస్తున్న వైద్యాధికారి

ఎస్.రాయవరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై దోమల నివారణకు సహకరించాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ కోరారు. ఎస్.రాయవరంలోని పలువీధుల్లో పర్యటించి, దోమల వల్ల వచ్చే సమస్యలను వివరించారు. యాంటీ లార్వా మందు పిచికారీ చేయించారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తంటపురెడ్డి నాగేశ్వరరావు, ఇన్‌చార్జి నోడల్ ఆఫీసర్ పి.ఎస్.వి.ఎస్. ప్రసాద్,సచివాలయ ఏఎన్‌ఎం పి.నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి కృషి

డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్


శిబిరంలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

నర్సీపట్నం: దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ సమగ్ర శిక్ష, పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల గుర్తింపు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విచ్చేసిన డిప్యూటీ డీఈవో మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులు, వారి తల్లిదండ్రుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ అధికారి శకుంతల మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందించడం కోసం గుర్తింపు నిర్ధారణ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉపకరణాలు అవసరమైన వారందరూ తప్పకుండా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఉపకరణాలు దైనందిన జీవితంలో తమ పనులు తాము చేసుకోవడానికి దోహద పడతాయన్నారు. వైద్య శిబిరంలో 67 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సాయిశైలజ, హెచ్‌ఎం డి.రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి గంటాకు లేదు'

నక్కపల్లి: టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు ఊసరవెల్లి అని, ఒక చోట పోటీ చేసి గెలిస్తే మళ్లీ అదే నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచే సత్తాలేని ఆయనకు... జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయిలేదని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో ఫలితాలు ప్రభుత్వ వ్యతిరేకతను రుజువు చేశాయని గంటా వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. గంటాను నమ్మి గెలిపించిన ఉత్తర నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో ముందు సమాధానం చెప్పాలన్నారు. గెలిచినతర్వాత మూడేళ్ల పత్తాలేకుండా పోయారన్నారు. దమ్ముంటే ఉత్తర నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేసి గెలిచి తన సత్తా నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

దంతాల సంరక్షణపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్

చోడవరం రూరల్: నోరు, దంతాల సంరక్షణ ద్వారా మొత్తం శరీర ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని చోడవరం ప్రభుత్వ ఆస్పత్రి దంత వైద్యురాలు పి.సరోజిని తెలిపారు. ప్రపంచ నోటి ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆటో డ్రైవర్లు, హాజరైన రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీనియర్ డాక్టర్ సరోజిని మాట్లాడుతూ ఎల్లవేళలా నోరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖైనీ, గుట్కా వంటి చెడు అలవాట్ల కారణంగా నోరు, దంతాలు క్షీణిస్తాయన్నారు. దంతాలు తరచూ శుభ్రం చేయకపోవడం వల్ల వచ్చే రోగాల గురించి సవివరంగా తెలిపారు. నోటిని తరచూ నీటితో పుక్కిలించడం ద్వారా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని సూచించారు. ఫిజియోథెరపిస్టు రవి మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రామ్, నేషనల్ హెల్త్ మిషన్ల ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు.

ఆశాజనకంగా అపరాల దిగుబడి


రోలుగుంటలో బొబ్బరి పంట

రోలుగుంట: మండలంలో రైతులు సాగు చేసిన అపరాల దిగుబడి ఆశాజనకంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మండలంలో రోలుగుంట, కొమరవోలు, కొండపపాలెం తదితర గ్రామాల్లో 850 ఎకరాల్లో బొబ్బరి, మినప, పెసర తదితర పంటలను సాగు చేపట్టారు. ఖరీఫ్ వరి కోతలు తర్వాత ఆరుతడి పంటలుగా వేశారు. ఈ నేపథ్యంలో మంచు ప్రభావానికి ఏపుగా ఎదిగి ప్రస్తుతం బొట్ట దశకు చేరుకున్నాయి. రైతులు వీటి సేకరణ పనులు చేపట్టారు. వాతావరణం అనుకూలించడంతో ఎకరా విస్తీర్ణంలో మినుములు 50 కుంచాలు, పెసలు 80 కుంచాలు, బొబ్బర్లు 80 కుంచాలు దిగుబడులు వచ్చాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మినుములు, పెసలు కుంచం రూ.300, బొబ్బర్లు కుంచం రూ.250 ధర పలుకుతోంది. ఈ పంటలకు విత్తనాలు చల్లడం మినహా దుక్కులు చేయడం, నీటి తడులు పెట్టుకునే అవసరంగాని, కూలీల అవసరంగాని లేదు. పెట్టబడి పోను ఇంటి ఖర్చులకు ఆదాయం సరిపోతుందని చెబుతున్నారు.

690 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


టీకాలు వేస్తున్న పశువైద్య సహాయకుడు సురేష్

కె.కోటపాడు: పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని గుల్లేపల్లి ఆర్బీకే పశువైద్య సహాయకుడు ఎం.సురేష్ తెలిపారు. గుల్లేపల్లిలో 1,349 గేదెలకు, ఆవులకు గాలికుంటు నివారణ టీకాలను వేసే కార్యక్రమాన్ని ఈ నెల ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్నామన్నారు. రాళ్లపల్లి, వేచలపు వారి కళ్లాల వద్ద శుక్రవారం 690 జీవాలకు టీకాలను వేసినట్లు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి బారిన పడితే పశువు నీరసించడం, పాల దిగుబడి తగ్గడం, చనిపోవడం వంటి నష్టాలు ఉంటాయని వివరించారు.

కాలేషావలి బాబా చందనోత్సవం నేడు


నరసింగబిల్లిలోని హజరత్ కాలేషావలి బాబా దర్గా

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి గ్రామం వద్దనున్న హజరత్ కాలేషావలి బాబా దర్గా 71వ ఉరుసు షరీఫ్(చందనోత్సవం) శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ అహ్మద్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు జెండా ప్రతిష్టాపన, సాయంత్రం 6 గంటల నుంచి బాబా చందనోత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు.

వ్యాపారాభివృద్ధికి రుణ సౌకర్యం


డాక్టర్ నవీన్‌కొలాట్‌కు చెక్కును అందిస్తున్న నటరాజ్

అనకాపల్లిటౌన్ : వివిధ రకాలైన వ్యాపారస్తులకు, వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా రుణసౌకర్యం కల్పిస్తుందని యూనియన్ బ్యాంక్ విశాఖ రీజనల్ మేనేజర్ కె.నటరాజ్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు యూనియన్ బ్యాంక్ ఆవరణలో శుక్రవారం ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న రుణ సౌకర్యాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. అనకాపల్లి క్లస్టర్ బ్రాంచ్‌ల ద్వారా రూ.9 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. బ్యాంక్ అందిస్తున్న వివిధ లోన్ల గురించి వివరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఏజీఎం తిలక్, బ్రాంచ్ మేనేజర్లు, ఖాతాదార్లు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వినతి

తుమ్మపాల : జిల్లా కేంద్రం అనకాపల్లిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేసి రోగులకు సేవలందించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి శుక్రవారం వినతిపత్రం అందించారు. జిల్లాలో అధిక సంఖ్యలో నిరుపేద మహిళలు, క్వారీ కార్మికులు కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వీరిలో ఎక్కువ మంది డయాలసిస్ రోగులున్నారని తెలిపారు. వీరంతా స్థానికంగా డయాలసిస్ కేంద్రం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఒక్కసారి డయాలసిస్ చేసుకోవాలంటే కనీసం రూ.ఆరు వేలు చెల్లించాల్సి వస్తుందని, అనేక మంది రోగులకు వారంలో రెండు సార్లు డయాలసిస్ అవసరమవుతోందన్నారు. పట్టణంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు ద్వారా ఇలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

రెండు రోజులుగా నిలిచిన నీటి సరఫరా


మండలానికి నీరందించే భారీ రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్

కశింకోట : మండల గ్రామాలకు రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏలేరు కాలువ నీటిని సంపతిపురం వద్ద నున్న భారీ రక్షిత మంచి నీటి పథకం ద్వారా శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం ఇక్కడి మోటార్ కాలిపోయింది. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కశింకోటలో వీధి కుళాయిలు వస్తున్నా, ఇంటింటి కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తక్షణమే మోటారుకు మరమ్మతులు చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. దీనిపై రక్షిత మంచినీటి పథకం ప్రాజెక్టు సూపర్‌వైజర్ మోహన్‌ను 'సాక్షి'సంప్రదించగా మోటారు మరమ్మతులు పూర్తి చేసి, నీటి సరఫరాకు సత్వర చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.